'స్వచ్ఛ'తపై నిర్లక్ష్యం వీడేదెన్నడు?

కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, ప్రజల అలసత్వం, బాధ్యతారాహిత్యం కారణంగా స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దని జీహెచ్ఎంసీ అధికారులు ఎన్నిసార్లు అవగాహన కల్పిస్తున్నా చాలామంది ప్రజల్లో ఎలాంటి మార్పు రావడంలేదు.


ఓయూ రోడ్డు విజ్ఞానపురి కాలనీ చర్చి సమీపంలోని బస్ స్టాప్ వద్ద పగిలిపోయిన డస్ట్ బిన్

- డస్ట్ బిన్‌ల నిర్వహణలో అలసత్వం
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- చాలా చోట్ల పగిలిపోయిన డస్ట్‌బిన్‌లు

నల్లకుంట: మూడేళ్ల క్రితం జీహెచ్ఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చించి తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని ప్రతి ఇంటికీ రెండేసి చెప్పున ప్లాస్టిక్ డస్ట్ బిన్‌లు (డబ్బాలు) ఉచితంగా అందజేశారు.

◆ వాణిజ్య సముదాయాలు, ఫుట్‌పాత్‌లపై స్థానికుల సౌకర్యార్థం స్టాప్‌ల వద్ద స్టాప్‌ల వద్ద డస్ట్‌బిన్‌లు కూడా ఏర్పాటు చేశారు.

◆ ఇంటింటికీ అందించిన డస్ట్ బిన్‌లను కొందరు ఇతర అవసరాలకు వినియోగిస్తూ ఇళ్లల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో తీసుకొచ్చి రోడ్లపై ఇష్టారాజ్యంగా పడవేసి వెళ్తున్నారు.

◆ ఇక వాణిజ్య సముదాయాలు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన స్టాండ్ డస్ట్ బిన్‌లు సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అవి శిథిలావస్థకు చేరుకుని కనుమరుగై పోతున్నాయి.

◆ కొన్ని ప్రాంతాల్లో డస్ట్‌బిన్‌లు పగిలిపోయి, మూతలు విరిగిపోవడంతో వ్యర్థాలు రోడ్లపై పడుతుండడంతో తీవ్రమైన దుర్గంధం వెలువడుతోంది. మరికొన్ని చోట్ల చెత్త సేకరణకు వచ్చే స్వచ్ఛ కార్మికులు నిర్లక్ష్యంగా వాటిని విరగ్గొట్టి పడేస్తున్నారు.

◆ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన


ఎస్‌వీఈఐఎస్ పాఠశాల ఎదురుగా

పౌరులు కొందరు నిర్లక్ష్యంగా చెత్తను తీసుకొచ్చి రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో తీవ్రమైన దుర్గంధం వెలువడుతుండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

◆ సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమాన్నైనా శ్రద్ధతో చేస్తే ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం అవుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వీడాలి



స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా జీహెచ్ఎంసీ అధికారులు ఆయా ప్రాంతాలలో ప్రధాన రహదారులు, వాణిజ్య సముదాయాలు, అంతర్గత వీధులు, బస్ స్టాప్‌ల వద్ద స్థానికుల సౌకర్యార్థం స్టాండ్ డస్ట్ బిన్‌లో ఏర్పాటు చేయించారు. వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన సంబంధిత సిబ్బంది, అధికారులు ఆ దిశగా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోక నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లు మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. చాలా చోట్ల డస్ట్‌బిన్‌లు మాయమయ్యాయి. కొన్ని చోట్ల పగిలిపోయాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి డస్ట్ బిన్‌లను ఉపయోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలి. – కె.వెంకట్‌నారాయణ, సామాజిక కార్యకర్త

28 నుంచి సుందరకాండ కార్యసిద్ధి హోమం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు అష్టోత్తర శత హనుమాన్ చాలీసా సహిత శ్రీమత్ సుందరకాండ కార్యసిద్ధి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. భక్తుల క్షేమం, లోక కల్యాణార్థం, వివాహం, నవగ్రహదోష నివారణ, ఉద్యోగ ప్రాప్తి, పదోన్నతి, వ్యాపారాభివృద్ధి, సంపూర్ణ ఆరోగ్యసిద్ధికి మహిమాన్వితుడైన ఆంజనేయస్వామి సంపూర్ణ అనుగ్రహం కోసం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

నేత్రపర్వంగా శ్రీరామ అక్షింతల శోభాయాత్ర



కాచిగూడ: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సరఫరా చేసిన శ్రీరామ స్పర్శ అక్షింతల కలశ శోభాయాత్రను ఆదివారం గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లో నిర్వహించారు. నెహ్రూనగర్‌లోని అమ్మవారి ఆలయం వరకు శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. అడుగడుగునా భక్తులు శోభాయాత్రకు పూజలు చేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రమణ, కృష్ణంరాజు, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని సంరక్షించుకోవాలి


రామాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడలోని క్వాలిటీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీ రామాలయం వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నేత సుభాష్ పటేల్ అయోధ్య శ్రీరాముని అక్షింతలతో కూడిన కళశాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కాచిగూడ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, చక్రపాణి, రాము, రవిశంకర్, సుదర్శన్, మల్లికార్జున్, సంతోష్, ఫంకజ్, అరవింద్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



చిక్కడపల్లి: పద్మశాలీ ప్రజా సంఘం ముషీరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం అశోక్‌నగర్ చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గుర్రం చంద్రకళ శంకర్‌లు హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు విశేష స్పందన


సంకల్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కవాడిగూడ: ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల సుపరిపాలనలో ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యాత్ర ఇన్‌చార్జి బి. చంద్రమోహన్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. రమేష్‌రాం, కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎం.సి.మహేందర్ బాబు తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో దేశవ్యాప్తంగా తిరుగుతున్న వాహనం ఆదివారం కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీ కమ్యూనిటీ హాల్‌కు వచ్చిన సందర్భంగా బీజేపీ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో జన్‌ధన్‌యోజన సంబంధిత బ్యాంక్ అధికారులు, ఉజ్వల గ్యాస్ పథకానికి సంబంధించిన అధికారులు, ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించిన అధికారులు, ఆధార్ మార్పులు, చేర్పులు అందుబాటులో ఉండగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యుడు గంట శ్రీనివాస్, బీజేపీ నేతలు తొలుపునూరి రమేష్‌గౌడ్, ఆకుల అశోక్, నర్సింహ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నె నర్సింహయాదవ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కృష్ణయాదవ్ తదితరులు

కాచిగూడ: ప్రముఖ సంఘ సేవకులు కన్నె నర్సింహ యాదవ్ ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ నేత, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ అన్నారు. ఆదివారం కాచిగూడ, చెప్పల్ బజార్‌లో కన్నె నర్సింహ యాదవ్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, బి.వెంకట్ రెడ్డి, సుభాష్ పటేల్, కేసరి నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక గ్యార్వీ


మత పెద్దలతో కలిసి గ్యార్వీ ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మతసామరస్యానికి గ్యార్వీ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ జహంగీర్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్‌గౌస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గ్యార్వీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ శాంతి ర్యాలీ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉత్సవాలు ప్రజలలో ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తున్నాయన్నారు. ఇరువర్గాల ప్రజలు పండగను ఐక్యంగా... ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావు, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నాయకుడు మోహిన్, ఎం.డి.షాహేద్, శివ ముదిరాజ్, భిక్షపతియాదవ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ కుమార్

అంబర్‌పేట: హెచ్ కంపెనీ, హనుమాన్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంబర్‌పేట పటేల్‌నగర్‌లో అన్నం కార్డుల లాంచింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్డులను లాంచింగ్ చేసిన అనంతరం సొసైటీ ఫౌండేషన్ చైర్మన్ అన్నం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ఐదు సంవత్సరాల క్రితం దివంగతులైన తన తండ్రి స్మారకార్థం పేదలకు చేయూతనందించాలనే సంకల్పంతో తన సంపాదనలో 10 శాతం సేవా కార్యక్రమాలకు వినియోగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ క్రమంలో బ్లూ, ఎల్లో అన్నం కార్డుల ద్వారా ఏ ఆసరాలేని వారికి సాయం చేయడంతో పాటు విద్యాపరంగా ఆదుకోవాలని నిర్ణయించామన్నారు. అలాగే ప్రతి నెల నిత్యావసర సరుకులు కూడా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అసోసియేషన్ ప్రతినిధులు రాగుల ప్రవీణ్ పటేల్, కె.రామారావు యాదవ్, శివ మల్లీ నాగేష్, కిశోర్, రాఏష్, శివ, సతీష్ బస్తీవాసులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సరోజవివేక్

కాచిగూడ: మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని, మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుంటుందని అంబేడ్కర్ కాలేజ్ చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ జి.సరోజ వివేక్ అన్నారు. ఆదివారం కాచిగూడ, హర్రాస్‌పెంట శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ, ఉచిత క్లినిక్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశారు. హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.గోపాల్ రావు అధ్యక్షత వహించారు. హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. డాక్టర్ ఐ.రాధిక కృష్ణ, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ కొండ శ్రీనివాస్ రావు, ప్రబంధక సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ముషీరాబాద్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ముషీరాబాద్ ప్రధాన రహదారిలోని జుపిటల్ వైన్స్ వద్ద 40-45 సంవత్సరాల వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందింది. పోలీసులు ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు స్థానికంగా భిక్షటన చేస్తూ జీవిస్తుంటాడని స్థానికులు వెల్లడించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే గాంధీ ఆస్పత్రి మార్చురీ సిబ్బంది లేదా ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ బెల్టుల ప్రదానం


విద్యార్థులకు గ్రేడింగ్ బెల్టులను ప్రదానం చేసిన డాక్టర్ లక్ష్మయ్య

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని అకాడమీలో కరాటే విద్యార్థులకు కలర్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన 28 మంది విద్యార్థులకు కలర్ బెల్ట్స్‌ను తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ బి.లక్ష్మయ్య ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరాటే నేర్చుకోవడానికి వయస్సుతో పనిలేదని, ఏవయస్సులో ఉన్నవారైనా కరాటే నేర్చుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి, కరీం, అమృతరెడ్డి, గణ సంతోషిణి, శ్యామ్ కుమార్, హంస, నందిని, అనగా, అవిఘ్న వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దళిత బహుజన సమితి గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్

బంజారాహిల్స్: తెలంగాణ దళిత బహుజన సమితి గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీగా గన్నారం ప్రశాంత్‌కుమార్ నియమితులయ్యారు. బంజారాహి ల్స్ రోడ్డు నెంబర్ -10లోని ఉదయ్‌నగర్ బస్తీకి చెందిన ప్రశాంత్‌కుమార్ దళిత బహుజన జాతి అభ్యున్నతికి అంకిత భావంతో నిస్వార్థంగా పనిచేస్తున్నందుకు ఆయనకు ఈ గుర్తింపు లభించింది. నియామక పత్రాన్ని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి చేతుల మీదుగా అందుకున్నారు.

కొమురవెల్లి ఆలయ కమిటీ సభ్యులుగా అంజియాదవ్, మధుసూదన్


అంజియాదవ్


మధుసూదన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కొమురవెల్లి మల్లన్న స్వామి దేవాలయం కమిటీ సభ్యుడిగా బాగ్‌లింగంపల్లికి చెందిన కె.అంజియాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తనకు నియామకపత్రాన్ని అందజేసినట్లు అంజి యాదవ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారని దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మరో సభ్యుడిగా బండారి మధుసూదన్...

కవాడిగూడ: కొమురవెల్లి మల్లన్న ఆలయ కమిటీ సభ్యుడిగా కవాడిగూడకు చెందిన బండారి మధుసూదన్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ ప్రకటించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తనవంతు పాత్ర పోషిస్తానని బండారి తెలిపారు. తనపై నమ్మకంతో సభ్యులుగా నియమించినందుకు దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, చైర్మన్ అంజన్‌కుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేటర్‌కు రామమందిర ప్రారంభోత్సవ ఆహ్వానం

హిమాయత్‌నగర్: అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రిక, అక్షింతలను హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మీ, రామన్‌గౌడ్‌లకు వీహెచ్‌పీ రాష్ట్ర, నగర నాయకులు నారాయణగూడలోని వారి కార్యాలయంలో కలిసి ఆదివారం అందజేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్, నగర నాయకులు బాలస్వామి, వాణి సక్కుబాయి పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి

లిబర్టీ: సమాజంలోని వ్యక్తులు, శక్తులు, పేదలకు చేయూతనియాలని భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎస్.శర్మ కోరారు. పేదరికంలో మగ్గుతున్న వారికి ఆసరాగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివారం పలు ప్రాంతాల్లో వృద్ధులకు పండ్లు, బ్రెడ్, ఆహార పదార్థాలను అందజేశారు.

తిరోగమన దిశగా విద్యాభివృద్ధి

టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి


మాట్లాడుతున్న ప్రొ. ఘంటా చక్రపాణి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి.. అవకాశాలు తిరోగమని దిశగా పయనిస్తున్నాయని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ఆవిర్భావ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ చక్రపాణి మాట్లాడుతూ... కేజీ టూ పీజీ ఉచిత విద్య అనేది ఒక ఆశగానే మిగిలిందన్నారు. ఉచిత విద్యను అందిస్తామని చెప్పిన మాజీ ముఖ్యమంత్రిని ఎందుకు ప్రశ్నించలేకపోయారని అన్నారు. ఉపాధ్యాయుల్లో సామాజిక చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్లాస్ రూమ్‌లు కాస్ట్ రూమ్‌లుగా మారాయని విచారం వ్యక్తం చేశారు. ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు హక్కులతో పాటు ధర్మం కోసం పోరాడాలని సూచించారు. ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ రామయ్యయాదవ్, ప్రముఖ రచయిత సొద అరుణ, లింగమయ్య యాదవ్, డీటీయూ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీ దామెర ఉపేందర్, ఎన్.రమేష్, నాగరాణి, అశోక్, కె.రాజు, రవిచంద్రన్, బి.రవి, సుధాకర్ పాల్గొన్నారు.

హైందవ సమాజంపై రాజకీయ కుట్రలు

ఏకం సనాతన్ భారత్ దళ్

హిమాయత్‌నగర్: రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కుట్రల కారణంగా హైందవ సమాజం చిన్నాభిన్నం అవుతున్నాయని, హిందూ దేవాలయాల ఆస్తులను, రాబడిని దోచేస్తూ, ఇతర మతాల అభివద్ధికి దుర్వినియోగం చేస్తున్నారని ఏకం సనాతన్ భారత్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజీవ్ షా, నరేంద్రకుమార్ చతుర్వేది ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కశ్మీర్‌లోని పురాతన సూర్య దేవాలయం, మార్తాండ్ ఆలయం, మధురలోని శ్రీకష్ణ జన్మభూమి, కాశీ వారణాసిలోని జ్ఞాన వాసి తీర్థ క్షేత్రాన్ని తక్షణమే పునః స్థాపన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 60 స్థానాలలో ఏకం సనాతన్ భారత్ దళ్ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. సనాతన హిందూ దేశమైన భారత దేశంలో హిందువులకు గతంలో కాంగ్రెస్, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాలలో న్యాయం జరగలేదని, బీజేపీ కేవలం హిందువులమని ప్రగల్భాలు పలుకుతూ మైనార్టీలకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీలకు అన్ని సంక్షేమ పథకాలతో పాటు, రాజకీయ పదవులను కట్టబెట్టిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత వంద శాతం సచార్ కమిటీ నివేదిక అమలుతో పాటు బీఫ్ ఉత్పత్తి కేంద్రాలకు అధికంగా అనుమతులు ఇచ్చిందని విమర్శించారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణ పూజా కార్యక్రమం సనాతన హిందువుల పద్ధతి ప్రకారం జరగలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా దేవాలయాలు, మఠాలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. దేవాలయాలను ప్రభుత్వ కబంధ హస్తాలను విముక్తి చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందిస్తామని వారు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే అన్నివర్గాల సంక్షేమం


పాదయాత్రలో పాల్గొన్న గుర్రం శంకర్, చంద్రకళ

చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ అన్నారు. ఆదివారం గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ పేరుతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందించేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రజాపాలనకు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు పేదల సంక్షేమాన్ని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు గుర్రం చంద్రకళ, అభిషేక్ కెనడీ, మారిశెట్టి నర్సింగరావు, గుండు జగదీశ్‌బాబు, సురేష్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సి.హెచ్. గిరి, హఫీజ్, రమేష్, గుర్రం దినేష్, మహేష్, సలాం, జాన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష పుష్పార్చన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష పుష్పార్చన వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా లోక కల్యాణార్థం ఈ వేడుకను కన్నులపండువగా జరిపారు. అర్చక స్వాములు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అక్షరాల లక్ష పుష్పాలతో శ్రీవారికి వైభవంగా ఈ తంతును జరిపారు. ఆలయ భక్తులతో పాటు ధనుర్మాస గోపికలు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి లక్ష పుష్పార్చనను తిలకించి పులకించిపోయారు. ఆలయ ప్రధాన అర్చకుడు అద్దంకి శశికాంత్ ఆచార్యులు నేతృత్వంలో వేద పండితులు విష్ణు సహస్ర నామం, స్వామివారి నామస్మరణ, మంత్రోచ్ఛారణలు, వేద మంత్రాలు పఠించారు. నాలుగు గంటల పాటు అంగరంగ వైభవంగా జరిగిన లక్ష పుష్పార్చనతో భక్తులకు తదియారాధన జరిగింది.

సంగీతం.. మానసికోల్లాసానికి దోహదం


హిందీ మెలోడీ కింగ్ అవార్డును వెంకటేశ్వర్‌రావుకు అందించిన దృశ్యం

చిక్కడపల్లి: సంగీతం మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తుందని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో స్వరరత్న పి.ఎస్.వెంకటేశ్వర్‌రావు నిర్వహణలో ఏ మెగా హిందీ మ్యూజికల్ నైట్ శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావుకు మెలోడి కింగ్ అవార్డు, ప్రముఖులు కుసుమ భోగరాజు, సుభాష్, రవీందర్ ఆచార్య సీతారామయ్య, రమేష్‌లకు స్నేహమిత్ర పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో నవరస గాయని ఆమని, ప్రముఖులు తుశార, శారద, గాంధీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టెక్నికల్ అధ్యాపకుల హక్కుల సాధనకు పోరాటం

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ప్రైవేటు టెక్నికల్ విద్యాసంస్థలలో పనిచేసే అధ్యాపకుల హక్కుల సాధన, వారు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని తెలంగాణ స్కూల్స్, టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఎస్ టీసీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్ కుమార్ ప్రకటించారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, కేలండర్‌లను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, జేఎస్‌టీయూ జేఏసీ చైర్మన్ శాడగొండ కరుణాకర్ రెడ్డిలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... నిబంధనల ప్రకారం అధ్యాపకులకు వేతనాలు నెలవారీగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అధ్యాపకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి డీ.శ్రీనివాస్, బీ.అనంత రామ్, కె.రాజు గుప్తా, సుగుణకర్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

20, 21వ తేదీల్లో ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలు

హిమాయత్‌నగర్: బాలికల ఆత్మ రక్షణ కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఖేలో ఇండియ మహిళా కిక్ బాక్సింగ్ లీగ్' పోటీలు ఈ నెల 20, 21వ తేదీల్లో తెలంగాణ రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో 10 సంవత్సరాలకు పైబడిన అమ్మాయిలు, మహిళలు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... వయస్సు, బరువును బట్టి ప్రత్యర్థులను నిర్ధారించి పోటీలు నిర్వహస్తామని తెలిపారు. కిక్ బాక్సింగ్ శిక్షణ పొందిన ప్రతి మహిళ అర్హులన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సాధారణ రూ. 200 రుసుము చెల్లించాలని వారు తెలిపారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు నర్సింగ్ రావు, శేఖర్, పోచయ్య, తిరుపతి, పూర్ణచందర్, రవికుమార్, ఆంజనేయులు, శివ పాల్గొన్నారు.